క్లుప్తంగా

విద్యార్థినికి అస్వస్థత



విద్యార్థినిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

పగిడ్యాల: స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయంలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని హారతి తీవ్ర అస్వస్థతకు గురైంది. శుక్రవారం ఉదయం టిఫిన్ చేశాక ఉదరం (చెస్ట్)లో నొప్పితో బాధపడుతుండగా సిబ్బంది స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యాధికారి మోహన్ సిఫారసు మేరకు స్టాఫ్ నర్సు కర్ణమ్మ విద్యార్థినికి వైద్యం అందించారు. అయినా నొప్పి తగ్గకపోవడంతో వెంటనే 108 వాహనం రప్పించి మెరుగైన చికిత్స నిమిత్తం నందికొట్కూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. కస్తూర్బా సిబ్బంది విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం అందించగా వారు కూడా 108 వాహనం వెంట బయలుదేరి వెళ్లారు.

వేతనాలు చెల్లించాలంటూ భిక్షాటన



కొత్తపల్లిలో భిక్షాటన చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

కొత్తపల్లి: గత 14 నెలలుగా వేతనాలు చెల్లించలేదంటూ స్వచ్ఛ భారత్ గ్రామీణ పారిశుద్ధ్య కార్మికులు శుక్రవారం మండల కేంద్రంలో భిక్షాటన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల నాయకులు ఎస్.స్వాములు, పారిశుద్ధ్య కార్మికుల సంఘం మండలాధ్యక్షుడు స్వాములు, ఎమ్మార్పీఎస్ నాయకులు రాజు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో నిధులు ఉన్నా కార్మికులకు జీతాలు ఇవ్వడంలేదన్నారు. పారిశుద్ధ్య కార్మికుల ఆకలి కేకలు విని పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ నివారణపై అవగాహన



మాట్లాడుతున్న కో–ఆర్డినేటర్ ఎస్.మహేశ్వర రెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్: రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. రెడ్ రిబ్బన్ క్లబ్ కో–ఆర్డినేటర్ ఎస్.మహేశ్వర రెడ్డి, అధ్యాపకురాలు కె.నిర్మల మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్ అంటు వ్యాధులు కాదని, తప్పిదాల వల్ల, నిర్లక్ష్యం వల్ల అంటించుకునే వ్యాధులని వివరించారు. ప్రతి ఒక్కరు వ్యాధులపై అవగాహన కలిగి ఉండి, వాటిని దరిచేరకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈవ్యాధులు సోకిన వారి పట్ల ప్రేమ,సానుభూతి చూపించాలని పేర్కొన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

మిడుతూరు: మండల పరిధిలోని జలకనూరు గ్రామానికి చెందిన చిట్టిబాబు అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. దీంతో బీమా పథకం నామినీగా భార్య చిట్టెమ్మకు తక్షణ సహాయం కింద రూ.10 వేలను గ్రామ సర్పంచ్ కురువ ఎల్లయ్య, ఎంపీటీసీ హరిసర్వోత్తమ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. పంచాయతీ కార్యదర్శి హసీనా తదితరులు ఉన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన ఆటోవాలాల పంచాయితీ

మహానంది: రెండు గ్రామాలకు చెందిన ఆటో డ్రైవర్ల మధ్య నెలకొన్న వివాదం శుక్రవారం పోలీస్‌స్టేషన్‌కు చేరింది. గాజులపల్లె, గోపవరం గ్రామాలకు చెందిన ఆటోలను నంద్యాలకు తిప్పుకుంటూ ఓనర్లు, డ్రైవర్లు జీవనం సాగిస్తుంటారు. అయితే వారి మధ్య వివిధ కారణాలతో వాగ్వాదం జరగడంతో మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ రెండు గ్రామాలకు చెందిన యూనియన్ సభ్యులు, బాధితులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

వామ్మో.. పెద్ద కొండచిలువ



కొండచిలువను పట్టుకున్న మోహన్

మహానంది: తమ్మడపల్లెలో కొండచిలువ కలకలం రేపింది. స్థానిక రామాలయం వద్ద శుక్రవారం రాత్రి కొండచిలువ కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అయ్యన్న నగర్ గ్రామానికి చెందిన స్నేక్ క్యాచర్ మోహన్‌కు సమాచారం అందించారు. వెంటనే మోహన్ గ్రామానికి చేరుకుని కొండచిలువను పట్టుకున్నారు. సుమారు 12 అడుగులకు పైగా పొడవుందని, పట్టుకుని నల్లమల అడవిలో వదిలేసినట్లు చెప్పారు. అలాగే మహానందిలోని ఈశ్వర్‌నగర్ కాలనీలో చౌదయ్య ఇంట్లో టాయిలెట్ వద్ద నాగుపాము కనిపించగా పట్టుకుని అడవిలో వదిలేశారు.



మహానందిలో వ్రతంలో పాల్గొనేందుకు వస్తున్న దంపతులు, భక్తులు



మహానందీశ్వరుడికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

వరములివ్వమ్మా వరలక్ష్మీ



ఓంకారం క్షేత్రంలో ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

మహానంది: వరములివ్వగా రావమ్మా.. వరలక్ష్మీ దేవి అంటూ మహానందిలో వరలక్ష్మీ వ్రతం కనులపండువగా జరిగింది. వేలాది మంది మహిళలు వ్రతంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. ప్రతి సంవత్సరంలాగే ఈ ఏడాది నంద్యాలకు చెందిన ఏజీఎస్ జ్యువెలర్స్ అధినేత అవ్వారు గౌరీనాథ్, గౌతమ్ కుమార్ దంపతుల ఆధ్వర్యంలో స్థానిక అభిషేక మండపంలో శ్రావణమాసం, రెండవ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ దేవి వ్రతం వైభవంగా చేశారు. వేద పండితులు రవిశంకర అవధాని, అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. భక్తుల చేత వ్రతం పూర్తి చేయించిన అనంతరం వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న భక్తులకు రవిక వస్త్రం, గాజులు, ప్రసాదాలను దాతలు పంపిణీ చేశారు. మహానంది దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓంకారంలో వైభవంగా వరలక్ష్మీవ్రతం

మహానంది: బండిఆత్మకూరు మండలం ఓంకారం దేవస్థానంలో శ్రావణమాసం, శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రత పూజలు వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకులు చక్రపాణి శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజలు, అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన, స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి, అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు.

మహానందీశ్వరుడి పల్లకీసేవ

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ గంగా, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి వారికి శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదంపడితులు, అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ఆలయ ప్రాకారంలో పల్లకీలో ఉంచి ఉత్సవం మహానందంగా చేశారు. వివిధ ప్రాంతాల భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు.



మహానందిలో ప్రత్యేక అలంకరణలో వరలక్ష్మీ అమ్మవారు

అపరాజిత దేవికి పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: ప్రాచీన విగ్రహాల పరిరక్షణలో భాగంగా శ్రీశైల క్షేత్ర పరిధిలో పలు చోట్ల గల దేవతామూర్తుల విగ్రహాలను సేకరించారు. స్థానికుల సూచనల మేరకు విభూతి మఠం వద్ద గల అమ్మవారి విగ్రహాన్ని ఉద్యానవన కార్యాలయంలో భద్రపరిచారు. కార్యాలయ భవనంలోని సహాయ స్థపతి వారి గదిలో గల అపరాజిత దేవి పాత విగ్రహాన్ని ఆలయ ప్రాంగణంలోని జమ్మి చెట్టు కింద ప్రతిష్ఠించారు. అపరాజిత దేవి విగ్రహాన్ని జమ్మి చెట్టు కింద నెలకొల్పడం శ్రేయస్కరమనే భావనతో దేవస్థానం సహాయ స్థపతి వారి పర్యవేక్షణలో ఈ విగ్రహం ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించినట్లు ఈఓ ఎస్ లవన్న తెలిపారు. శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ పర్వదినం పురస్కరించుకుని శుక్రవారం ఉదయం ఈ విగ్రహానికి అభిషేకాది అర్చనలు నిర్వహించారు. స్వామివారి ఆలయ ప్రధానార్చకులు శివప్రసాద స్వామి, అమ్మవారి ఆలయ ఉపప్రధానార్చకులు బీవీఎస్ శాస్త్రి, అర్చక బృందం అమ్మవారికి పూజాదికాలను నిర్వహించారు. సహాయ కార్యనిర్వాహణాధికారి మోహన్ తదితర సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

బోరు సౌకర్యం ఏర్పాటు

నందికొట్కూరు: ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ సహకారంతో తొగటవీర క్షత్రియ శ్మశాన వాటికలో శుక్రవారం బోరు వేయించారు. పట్టణ సమీపంలోని కొణిదేల రహదారి వైపు ఉన్న శ్మశానంలో బోరు వేయించిన సందర్భంగా తొగటవీర క్షత్రియ కుటుంబాలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఆ వర్గం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కృషితో బోరు వేయించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇకపై అంత్యక్రియల కోసం శ్మశానానికి వచ్చే ప్రజలకు నీటి సమస్య ఉండదన్నారు. చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రవీంద్రబాబు, ఉపాధ్యక్షుడు ఆర్ట్ శ్రీను, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి బాబు, సభ్యులు ఉన్నారు.



శ్మశాన వాటికలో బోరుబావి వేస్తున్న దృశ్యం

గిరిజనులకు మెరుగైన సౌకర్యాలు

మహానంది: గిరిజనులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు పర్టిక్యులర్ వనరబుల్ ట్రైబల్ గ్రూపు(పీవీటీజీ) సర్వే చేస్తున్నట్లు బండిఆత్మకూరు ఎంపీడీఓ వాసుదేవగుప్త తెలిపారు. బండిఆత్మకూరు మండలం ఈర్నపాడు మజరా గ్రామమైన నాయిని చెరువులో శుక్రవారం సర్వే చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. గిరిజన, చెంచు గూడెంలలో ప్రస్తుతం ఉన్న సౌకర్యాలు, కావాల్సిన వాటిపై ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయనున్నట్లు చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

బెట్ట నుంచి పైర్లను కాపాడుకోండి

జూపాడుబంగ్లా: బెట్ట నుంచి పైర్లను కాపాడుకోవడానికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన తర్తూరు గ్రామంలోని వ్యవసాయ పొలాలను, పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆయన రైతులతో మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున రైతులు సాగుచేసిన పంటలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎండబెట్ట నుంచి పంటలను కాపాడుకోవటానికి లీటరు నీటిలో 10 గ్రాముల యూరియా, 10 గ్రాముల మల్టీకే కలిపి పంటలపై పిచికారీ చేయాలని సూచించారు. త్వరగా పంట నమోదు చేయించుకోవాలన్నారు. కేసీ ఆయకట్టు రైతులు ఆరుతడి పంటలు మాత్రమే సాగుచేసుకోవాలని ఏఓ కృష్ణారెడ్డి సూచించారు. రైతులు మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితుల వల్ల పైర్లు గిడసబారి ఎండిపోతున్నాయని వాపోయారు. పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని వారు రైతులకు హామీఇచ్చారు. ఆర్బీకేల సిబ్బంది ఉన్నారు.



తర్తూరులో పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ కృష్ణారెడ్డి

దాడి ఘటనలో నలుగురిపై కేసు నమోదు

కొత్తపల్లి: మహిళపై దాడిచేసిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హుస్సేన్ బాషా శుక్రవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పాతమాడుగుల గ్రామానికి చెందిన గొల్ల జ్యోతి భర్త బక్కన్నలకు కొన్నేళ్ల నుంచి 10 సెంట్ల స్థలం అనుభవంలో ఉందని తెలిపారు. ఈ స్థలం తమది అంటూ అదే గ్రామానికి చెందిన డిస్సు సామన్న, రాంబాబు, పాలెం శీను, కన్నయ్య ఈ నెల 23వ తేదీ రాత్రి సమయంలో ఇంటిపైకి వెళ్లి జ్యోతి, భర్త బక్కన్నపై దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై బాధిత మహిళ జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని, విచారణ చేస్తున్నామని ఎస్ఐ వెల్లడించారు.

సీసీ రోడ్డు నిర్మాణం పరిశీలన

కొత్తపల్లి: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తుందని సర్పంచ్ మారెన్న అన్నారు. శుక్రవారం గోకవరం పంచాయతీ పరిధిలోని ఎం.లింగాపురం గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల మేరకు సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. కాంట్రాక్టర్లు అవినీతికి పాల్పడరాదన్నారు. ప్రభుత్వం పేద ప్రజలు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ధ్యేయంగా పాలన సాగిస్తుందన్నారు. ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ ప్రత్యేక చొరవతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా సీసీ రోడ్ల నిర్మాణం చేయిస్తున్నారన్నారు. రూ.10 లక్షల వ్యయంతో 186 మీటర్ల దూరం సీసీ రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చెన్నయ్య, జయన్న, తదితరులు ఉన్నారు.

వరుణుడి కటాక్షం కోసం భజనలు

పాములపాడు: వరుణుడి కరుణ కోసం మండల కేంద్రంలోని పీర్లచావిడి వద్ద మౌలాలి స్వామి సన్నిధిలో ప్రజలు ప్రత్యేక భజన కార్యక్రమం శుక్రవారం తెల్లవారుజాము వరకు నిర్వహించారు. వర్షాలు కురవక పోవడంతో పైర్లు ఎండు దశకు చేరాయి. కొందరు రైతులు పైర్లను దున్నేశారు. ప్రస్తుతం ఉన్న పైర్లు చేతికి రావా లంటే వరుణుడి కటాక్షం తప్పనిసరిగా మారింది. దీంతో మండల కేంద్రంలోని పీర్లచావిడి వద్ద 5 రోజులుగా భజన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మండలంలోని కృష్ణానగర్, కంబాలపల్లి, ఇస్కాల గ్రామాల నుంచి భజన బృందాలు పాములపాడుకు చేరుకొని భజన కార్యక్రమం నిర్వహించారు. చివరి రోజు కావడంతో మౌలాలిస్వామి కమిటీ వారు భజన బృందం సభ్యులు, ప్రజలకు అన్నదానం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం శిఖరం సమీపంలోని బయన్న సెలకు వెళ్లే మలుపు వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో దేశావత్ బాలాజీనాయక్ (65) తీవ్రంగా గాయపడ్డారు. శ్రీశైలం నుంచి దోర్నాల మండలం బోడేనాయక్ తాండకు బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కొరియర్ వాహనం ఢీకొనడంతో కుడికాలుకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది సున్నిపెంట ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువచ్చి ప్రాథమిక చికిత్స నిర్వహించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

సమగ్ర సర్వేపై శిక్షణ

మిడుతూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు – భూ రక్ష పథకానికి సంబంధించి శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి, తహసీల్దార్ ప్రకాష్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అలగనూరు, రోళ్లపాడు, చెరుకుచెర్ల, జలకనూరు, బైరాపురం, బన్నూరు, చౌట్కూరు, గ్రామ పంచాయతీలలో స్వామిత్వ సర్వే చేస్తారని, ఈ కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, సర్వేయర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్ తదితరులు పాల్గొని గ్రామ సభలలో చర్చిస్తారని తెలిపారు.

సోలార్ ప్రాజెక్టుకు స్థానిక భూములు కేటాయించొద్దు

మిడుతూరు: మా ప్రాంతంలో సోలార్ ప్రాజెక్టు కోసం భూములు కేటాయించవద్దని పైపాలెం గ్రామ సర్పంచ్ రామచంద్రుడు, పీరుసాహెబ్ పేట సహకార సొసైటీ చైర్మన్ నాగ తులసిరెడ్డి తదితరులు నంద్యాల జిల్లా జేసీ రాహుల్ కుమార్ రెడ్డికి విన్నవించారు. శుక్రవారం మండల పరిధిలోని పైపాలెం, నాగలూటి గ్రామాల పరిధిలో విస్తరించిన గట్టు ప్రాంతాన్ని జేసీ పరిశీలించారు. ఈ సందర్భంగా పైపాలెం సర్పంచ్, సహకార సొసైటీ చైర్మన్‌తో పాటు సీపీఎం నాయకులు, రైతులు జేసీని కలిసి తమ ప్రాంతంలో సోలార్ ప్రాజెక్టుకు ప్రత్యామ్నాయంగా ప్రజలకు జీవనోపాధి మెరుగుపడేలా పరిశ్రమలను ఏర్పాటు చేయడంతో పాటు మెట్ట భూములకు హంద్రీ–నీవా ద్వారా సాగునీరందించి ఆదుకోవాలని విన్నవించారు. జేసీ మాట్లాడుతూ.. త్వరలో గ్రామాలలో సభలు ఏర్పాటుచేసి ప్రజల అభిప్రాయాలను సేకరించాలని ఆర్‌డీఓ దాసును ఆదేశించారు. అనంతరం నాగలూటి గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రంను తనిఖీ చేశారు. సచివాలయ సేవలు, రైతులకు పంట నమోదు, తదితర సేవలపై అడిగి తెలుసుకున్నారు.



పైపాలం గట్టు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

■ సుంకేసుల గ్రామానికి చెందిన బోయ నాయుడు అనే రైతు 40 ఏళ్ల నుంచి భూమిని సాగు చేసుకుంటున్నానని, ఆన్‌లైన్‌లో నమోదు చేయడం లేదని జేసీ దృష్టికి తీసుకెళ్లగా నెల రోజుల్లోపు సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

■ మిడుతూరు జగనన్న కాలనీ వెళ్లే రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని స్థానికుడు బక్కన్న వినతిపత్రం అందజేశారు.

జేసీ వెంట ఆత్మకూరు ఆర్‌డీఓ దాసు, తహసీల్దార్ ప్రకాష్ బాబు, మండల సర్వేయర్ కృష్ణుడు, గ్రీన్‌కో ప్రతినిధులు, వీఆర్వో ఖాదర్ బాష, గ్రామ సర్వేయర్లు ఉన్నారు.

పార్టీ పదవుల కేటాయింపుపై హర్షం



శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డితో వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సెక్రటరీ కోసిక తిరుమలేశ్వర రెడ్డి





వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్లు పీరయ్య, నాగరాజు

జూపాడుబంగ్లా: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నూతన జిల్లా కమిటీ నియామకంలో భాగంగా మండలంలోని తాటిపాడు గ్రామానికి చెందిన కోసిక తిరుమలేశ్వర రెడ్డిని జిల్లా కమిటీ సెక్రటరీగా నియమించారు. దీంతో ఆయనకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందనలు తెలిపారు. శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి సహకారంతో తనకు జిల్లా కమిటీలో స్థానం లభించడం సంతోషంగా ఉందని కోసిక తిరుమలేశ్వర రెడ్డి తెలిపారు.

పాములపాడు: మండలంలోని ఇస్కాల గ్రామానికి చెందిన బంగారం మౌలాలిని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం రాత్రి ప్రకటన విడుదల చేసింది. వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీలో మండలం నుంచి ముగ్గురికి చోటు దక్కింది. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మద్దూరు మజారా కృష్ణానగర్ గ్రామానికి చెందిన పీరయ్య, పాములపాడుకు చెందిన నాగరాజులను అధిష్టానం నియమించింది.



వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మౌలాలి

అధిష్టానం తమపై ఎంతో నమ్మకం ఉంచి కమిటీలో స్థానం కల్పించడంపై వారు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే తొగురు ఆర్థర్, శాప్‌చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. తమ బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల



పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి కొనసాగుతున్న నీటి ప్రవాహం

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 6 వేల క్యూసెక్కుల నీటిని ఎస్సార్ఎమ్సీ కాల్వలోకి సరఫరా చేస్తున్నట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. శ్రీశైలం డ్యాంలో మధ్యాహ్నం 3 గంటల సమయానికి 856.20 అడుగుల నీటిమట్టం ఉండగా పోతిరెడ్డిపాడు వద్ద 855.20 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు తెలిపారు. పోతిరెడ్డిపాడు 5 గేట్ల ద్వారా 6 వేల క్యూసెక్కుల నీటిని ఎస్సార్ఎమ్సీ కాల్వలోకి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ నీటిని బానకచర్ల నీటి నియంత్రణ వ్యవస్థ నుంచి తెలుగుగంగ కాల్వకు 2 వేల క్యూసెక్కులు, ఎస్సార్బీసీ (జీఎన్ఎస్ఎస్) కాల్వకు 3 వేల కేసీ ఎస్కేప్ కాల్వకు వెయ్యి క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు ఏఈ దేవేంద్ర తెలిపారు.

ఎంపీపీకి ఘన సత్కారం

వెలుగోడు: విద్యుత్ సబ్‌స్టేషన్ల అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన వెలుగోడు మండల ఎంపీపీ లాలం రమేష్‌ను వైస్ ఎంపీపీ కొడావత్ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీని పూలమాలలు, దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ.. మండల పరిధిలో ఏ సమస్య వచ్చినా పరిష్కారం చేయడానికి ప్రయత్నం చేసే ఎంపీపీకి ఇలాంటి పదవులు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఇందుకు సహకరించిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గిరిజన సంఘం నాయకులు నగేష్ నాయక్, వైఎస్సార్సీపీ యూత్ నాయకులు రెడ్డి నాయక్, సుధాకర్ నాయక్, చందునాయక్, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీపీని సన్మానిస్తున్న వైస్ ఎంపీపీ, గిరిజన సంఘం నాయకులు

వివాదాస్పద స్థలం పరిశీలన

పగిడ్యాల: మండల పరిధిలోని పడమర ప్రాతకోటలో ఇరువర్గాల మధ్య వివాదాస్పద స్థలాన్ని ఎంపీడీఓ వెంకటరమణ, డీటీ మురళి, ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున శుక్రవారం పరిశీలించారు. వీరముసలాయ గుడికి గతంలో స్థలం కేటాయించినట్లు గ్రామ మ్యాప్‌లో ఉందని, ఎంత స్థలం కేటాయించారు? ఏఏ సర్వే నంబర్లలో ఉందో? రికార్డులను పరిశీలిస్తామని డీటీ ఎస్ఐకి వివరించారు. అయితే గత 20 ఏళ్లకు పైగా గ్రామ పంచాయతీ స్థలం కల్వర్టు వద్ద అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని భావించి, ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలు ఇక్కడే నిర్వహిస్తూ వచ్చామని దళితులు అధికారులకు తెలియజేశారు. దీనిపై స్పందించిన ఎస్ఐ ఇరువర్గాలు సమస్యను స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కరించుకోవాలని అల్లర్లు చేసి గొడవలు పెట్టుకుంటే అందరిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. గ్రామ రికార్డులు, రోడ్డుకు ఎంత స్థలం విడిచారు అన్నది అధికారులు పరిశీలిస్తారని అందరూ ఏకాభిప్రాయానికి వచ్చి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం ఇరువర్గాలు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈఓఆర్డీ నాగేంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి ఇషాం బాష, సర్వేయర్లు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



ఇరువర్గాలకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ నాగార్జున

శిథిలావస్థలో ధ్వజస్తంభం

జూపాడుబంగ్లా: మండలంలోని 80 బన్నూరు సమీపంలోని జూపాడు వద్ద ఉన్న శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో ధ్వజస్తంభం శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. శిథిలమైన ధ్వజ స్తంభాన్ని మార్చడంలో ఆలయ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు. ఆలయాని మూలాధారం అయిన ధ్వజస్తంభం చెదలు పట్టి శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉన్నా దేవదాయ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై భక్తులు విమర్శిస్తున్నారు. ఆలయానికి సుమారు 43 ఎకరాల మాన్యం భూములుండగా వాటి వేలాల ద్వారా ఏటా రూ.8 లక్షల ఆదాయం సమకూరుతుంది. ఆదాయ వనరులున్నా శిథిలమైన ధ్వజస్తంభాన్ని మార్చకపోవడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదవశాత్తు ధ్వజస్తంభం కూలితే అపచారం అవుతుందని పేర్కొంటున్నారు. శ్రావణ మాసం కావడంతో ఆలయానికి నిత్యం భక్తులు వస్తుంటారని, ఎక్కువ మంది ఉన్న సమయంలో ధ్వజస్తంభం కూలితే తీవ్ర పరిణామాలు చవిచూడాల్సి వస్తుంది. ప్రమాదం చోటుచేసుకోకముందే శిథిలమైన ధ్వజస్తంభాన్ని తొలగించి కొత్తగా ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.



జూపాడు రామాలయంలో చెదలు పట్టి శిథిలావస్థలో ఉన్న ధ్వజస్తంభం

దేశాన్ని కాపాడుకుందాం

నందికొట్కూరు: దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీపీఐ జిల్లా నాయకులు రఘురామమూర్తి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై పటేల్ సెంటర్‌లో రైతుల సమస్యలపై ప్రచార బస్సు యాత్ర జయప్రదం చేయాలని కోరుతూ బైక్ ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలో ఈ నెల 17వ తేదీన సీపీఐ బస్సు యాత్రను ప్రారంభించడం జరిగిందన్నారు. స్థానిక సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి

శ్రీశైలంప్రాజెక్ట్: బాల్య వివాహాల నిర్మూలనపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం సున్నిపెంటలోని శ్రీశైలమాత ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు సీడీపీఓ సూర్యకుమారి మాట్లాడుతూ.. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. చిన్నతనంలోనే వివాహం చేయడం వల్ల బాలికలు ఆరోగ్యపరంగా అనేక సమస్యలు ఎదుర్కొంటారని, సామాజికంగా ఆర్థికంగా వెనుకబడతారని పేర్కొన్నారు. సూపర్‌వైజర్లు కుమారి, దేవజయమ్మ, విజయకుమారి, కోమల, సీఆర్‌పీ సంజీవరాయుడు, హెడ్ కానిస్టేబుల్ బలరాం యాదవ్, ప్రిన్సిపాల్ రాధిక, నాయక్ పాల్గొన్నారు.